# హృదయఘోష

## పొట్టిముత్యాల వనజ

శివరాత్రి... ఊరంతా నిశ్శబ్దంగా నిదరోతూంది ఒక్క మూర్తిగారిల్లు తప్ప! రేపు జరగబోయే మూర్తిగారి ఏకైక పుత్రరత్నం అరుణ్ పెళ్ళికి ఇంటి ముందున్న ఆవరణలో పెద్ద షామియానా వేసి రకరకాల అలంకరణలతో వారి స్టేటస్‌కు తగినట్లు గ్రాండ్‌గా డెకరేట్ చేస్తున్నారు.

పెళ్ళికి వచ్చిన బంధువులంతా ఆ బంగళాలో క్రిందున్న గదులన్నింటిలోనూ సర్దుకుని వుండిపోయారు. మేడమీద కెళ్ళే ధైర్యం చొరవ అక్కడున్న వారెవరికీలేదు. ఒక్క ఆ ఇంటి నౌకరు రంగన్నకు తప్ప.

ఆ మేడ మీదున్నది రెండే రెండు పెద్ద గదులు. ఒకటి ఆ ఇంటి యజమాని శ్రీరామచంద్రమూర్తి గారిది రెండు ఆతని వంశోద్ధారకుడైనటువంటి అరుణ్‌ది.

* * *

అరుణ్ గది తలుపులు మెల్లగా తెరచుకున్నాయి. నిరసనగా ఓసారి తండ్రి గది వంక చూశాడు. తీతువు పిట్ట ఒకటి భయంకరంగా అరుస్తూ రెక్కలు టపటప లాడించుకుంటూ ఆ ఇంటి చుట్టూ తిరగసాగింది. దాని వికృతమైన అరుపుకు విరక్తిగా నవ్వుకున్నాడు అరుణ్.

ఇక ఆలస్యం చేయకు తెల్లారిపోవచ్చింది అనుకుని పనిని త్వరగా ముగించమంటూ, తన అంతరాత్మ పదేపదే గుర్తుచేస్తూ వుంది.

బొడ్లో వున్న కత్తిని మరోమారు తడిమిచూసుకుని దీర్ఘంగా నిట్టూర్చాడు. తన కన్న తండ్రిని చంపడానికి ఆతని గదివైపుకి పిల్లిలా అడుగులువేస్తూ మెల్లగా తలుపులను తోశాడు. అవి చప్పుడుకాకుండా తెరచుకున్నాయి. వెంటనే లోనికి వెళ్ళి తలుపులను మూసి ఆ కత్తి పిడిని తన కుడిచేతిలో గట్టిగా పట్టుకుని మూర్తిగారి మంచాన్ని చేరుకున్నాడు.

* * *

లంకంత ఇంటికీ లక్షల ఆస్తికీ వారసుడు అరుణ్. మూర్తిగారి పంచప్రాణాలూ అరుణ్‌లో వున్నాయి కాబట్టే! అరుణ్ అడ్డాల్లో బిడ్డగా వున్నప్పుడే మూర్తిగారి భార్య వేదవతి కన్నుమూయగానే ఎవరెన్ని చెప్పినా మరో పెళ్ళి చేసుకోకుండా ఆశలన్నీ అరుణ్‌మీదనే పెట్టుకుని అహర్నిశలూ అరుణ్ శ్రేయస్సుకై ప్రాకులాడుతూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ పెంచి పెద్ద చేసి విద్యావంతుడ్ని చేశాడు. బి.ఇ చదివిన అరుణ్ పైచదువులకు 'యు.ఎస్.ఏ'కు వెళ్ళాలనుందన్నాడు.

అరుణ్‌ని చూడకుండా ఒక్కక్షణమైనా బ్రతకలేని మూర్తిగారు ఈ విషయాన్ని ఖండించారు. తరతరాలుగా కూర్చునితిన్నా తరగని సంపదనుకాదని ఉద్యోగంచేయవల్సిన అవసరం ఆగత్యం మనకులేదని విశదీకరించారు.

అరుణ్ తండ్రి మాటను జవదాటనివాడు. పితృవాక్య పరిపాలనా దక్షుడైన శ్రీరామచంద్రు డంతటివాడు. అతడికి తండ్రంటే ప్రేమ భక్తీ ఈ రెండూ హృదయమంతా నిండిపొంగి పొర్లుతున్నాయి. అందుకే తండ్రి ఆజ్ఞను శిరసావహించి వెంటనే ఆ ప్రయత్నాన్ని మానుకుని ఇంటిపట్టునే వుండి ఆస్తివ్యవహారాలు చూసుకోదలిచాడు.

ఈ మధ్యనే మూర్తిగారికి కారు యాక్సిడెంట్‌లో కాలు విరిగిపోయింది. దానితోపాటే అతని ఆరోగ్యమూ క్షీణించసాగింది. ఇక ఎక్కువకాలం బ్రతకనని తెలిసి అరుణ్‌ని పిలిపించాడు.

"అరుణ్! నా ఆరోగ్యం అంతిమదశకు చేరుకుంది బాబూ! నాక్కూడా త్వరగా మీ అమ్మను చేరుకోవాలనుంది. నేనింతకాలం కష్టపడి నిన్నో ప్రయోజకుడ్ని చేశాను. ఇంతటితో నా మనసు తృప్తిపడటంలేదు. ఇంకొక్క బాధ్యత నాపైన వుంది. అదే నీ పెళ్ళి... నీ పెళ్ళి కళ్ళారాజూసి నిశ్చింతగా కన్ను మూస్తాను.

మన తాహతుకు తగిన సంబంధం సిరిపురం జమిందారు కుటుంబం. నువ్వు వారి అమ్మాయిని చేసుకుంటే మన ఆస్తీ అంతస్థులు గౌరవ మర్యాదలూ పదింతలుగా రెట్టింపవుతాయి... ఏమంటావు బాబూ!"

అరుణ్ మౌనంగా తలదించుకున్నాడు.

"చెప్పు అరుణ్! నా దగ్గర సంకోచించకు నీ మనసులో ఏం వుందో నాకు విశదీకరించు నాయనా!" అన్నారు ఆప్యాయంగా.

"నాన్నగారూ! మరేమో.., మరేమో..." అంటూ ఆర్ద్రోక్తిలో ఆగిపోయాడు.

"ఊ...! ఆపేశావేం" అన్నారు ఆత్రుతగా.

"శిల్పను పెళ్ళాడాలనుంది... శిల్ప పేద పిల్ల... మీ కిష్టమైతేనే చేసుకుంటాను కాదంటే...!

"ఆ! కాదంటే...?"

"తల్లిదండ్రులను సంతోష పెట్టడం పిల్లల బాధ్యత. పెద్దల మనసులను నొప్పించడం శ్రేయస్కరం కాదంటారు. అందుకే మీరు శిల్పను కాదంటే మీ ఇష్ట ప్రకారమే మీకు నచ్చిన అమ్మాయి మెళ్ళోనే మూడుముళ్ళూ వేస్తా..."

"ఆపు అరుణ్! నువ్వీ మాటలు మనఃస్ఫూర్తిగానే అంటున్నావా! చూడు బాబూ! పెళ్ళంటే నూరేళ్ళ పంట నీ జీవితాన్ని నీకు నచ్చిన విధంగా మలుచుకో! నువ్వుకోరుకున్న పిల్లనే పెళ్ళి చేసుకో! ఇందులో ఒకళ్ళ ప్రమేయం నీకనవసరం. నిన్నింతో స్వతంత్ర భావాలు కలవాడిగా తీర్చిదిద్దాననుకుని మురిసిపోతున్న నేను కేవలం నువ్వీ విషయంలో తండ్రికి తలవంచి నీ మనసును చంపుకుని..." ఆవేశంలో ఆయాసం పొంగుకొచ్చి ఊపిరాడని దగ్గుతో ఉక్కిరిబిక్కిరైపోసాగారు మూర్తిగారు.

"నాన్నగారూ!" అంటూ ఆదుర్దాగా ముందుకువంగి అతని గుండెల్ని మెల్లగానిమిరి కొద్దిగా మంచినీళ్ళు తాగించి పడుకోబెట్టాడు అరుణ్.

మూర్తిగారు పడుకున్నారన్న మాటేగానీ అతని మనసంతా వికలమై పోయింది. గతం తాలూకు నీలినీడలు ముఖమంతా అలుముకుని నుదురు స్వేదబిందువులతో నిండిపోయింది. అరుణ్ మాటలతో కరగిపోయిందనుకున్న హాలాహలంలాంటి గతం మళ్ళీ కరడుగట్ట సాగింది.

నా అరుణ్ నాలా పిరికిపంద కాకూడదు. పిరికిపంద కాకూడదు. తన గుండెల్ని మెలి పెడుతున్న 'హృదయఘోష'.

"నాన్నగారూ! ఏమిటండీ మీరేదో పలవరిస్తున్నారు?" అన్నాడు ఆవేదనగా అరుణ్.

బరువుగా కనురెప్పలెత్తి అరుణ్‌వంక చూశారు మూర్తిగారు. ఆ ప్రక్కనే గోడకు వ్రేలాడుతున్న వేదవతి ఫోటోవైపుకి మళ్ళాయి తన చూపులు.

'అరుణ్ ముమ్మూర్తులా తల్లిపోలికే! కానీ బుద్ధులు? తండ్రివా! నో అలా కావడానికివీల్లేదు. నా బిడ్డనాలామారకూడదు. నాలా మారకూడదు' మూర్తిగారి కళ్ళల్లోంచి కన్నీరు జలజలమని ప్రక్కలకు కారిపోతూ తలగడ తడిసిపోసాగింది.

"చిన బాబుగారూ! నాన్నగారి గురించి మీరేమీ కలతచెందకండి. అమ్మగారు గుర్తొచ్చినప్పుడల్లా అయ్యగారు ఇలాగే గుండెనెప్పితో మెలికలు తిరిగిపోతూంటారు. నే దగ్గరుండి చూసుకుంటాను. మీరెళ్ళండి బాబూ! అన్నాడు నౌకరు రంగన్న.

"నేనిక్కడే వుంటాను. ముందు నువ్వెళ్ళి డాక్టరును పిలుచుకురా రంగన్నా" అంటూ మూర్తిగారి గుండెల్ని నిమరసాగాడు అరుణ్.

ఆ మరురోజు శిల్ప తల్లిదండ్రుల్ని పిలిపించి విషయాలు చర్చించి తాంబూలాలు మార్చుకున్నారు. ఇరుపక్షాల పెళ్ళి ఖర్చులు తానే భరిస్తానన్నారు మూర్తిగారు.

**అరుణ్ తలలో డైనమెట్స్ భయంకరమైన శబ్దాలు చేస్తూ ప్రేలుతున్నాయి. గిర్రున కళ్ళు తిరిగిపోతున్నాయి. తన శరీర అలాగే భూమిలోనికి కూరుకు పోతున్నట్లుగా వుంది. చెవుల్లో సీసం పోసినట్లు— పూర్తిగా మూసుకుపోయాయి.**

'బతకలేక బడిపంతులన్నట్లు' చాలీచాలని జీతంతో కుటుంబాన్నే పోషించలేని తనకు ఇప్పుడా పెళ్ళి బాధ్యతను మూర్తిగారు స్వీకరించగానే పరమానంద భరితుడయ్యాడు శిల్ప తండ్రి పరంధామయ్యగారు.

"అమ్మాయిని కూడా మీరొకసారి చూస్తే, బావుం..."

"ఫరవాలేదు. ఇప్పుడే అరుణ్ మీ అమ్మాయి ఫోటో చూపించాడు. అందంలో అపరంజి బొమ్మ మా ఇంటి మహాలక్ష్మి నేను మనఃస్ఫూర్తిగా ఇష్టపడే మీతో వియ్యాన్ని కోరుకుంటున్నాను" అన్నారు మూర్తిగారు.

పెళ్ళి దగ్గర పడుతున్న కొద్దీ మూర్తిగారి మనోవ్యధ అధికం కాసాగింది. రోజురోజుకూ వారి ఆరోగ్యం క్షీణించిపోతూ ఎటూకదల్లేని స్థితిలో మంచానికి బల్లిలా అంటుకుపోసాగారు.

ఇంటి నిండుగా బంధుజనం ఊర్లనించి వచ్చేస్తున్నారు. ఇల్లంతా పెళ్ళి సందడితో కళకళ లాడిపోతూ వుంది.

కానీ మూర్తిగారి ముఖంలో కళాకాంతులు పూర్తిగా మాయమైపోయాయి. ఎప్పుడూ తన భార్య వేదవతి ఫోటో వంక చూపులు నిలిపి దీర్ఘంగా ఆలోచిస్తూ వుండిపోయేవారు.

క్షణాలు నిమిషాలు గంటలు ఆఖరికి రోజంతాకూడా అలాగే ఏదో మానసిక సంఘర్షణతో సతమతవఖ్తుండేవారు.

తండ్రి వేదనకు కారణమడగాలని అరుణ్ రెండు మూడుసార్లు గదిలోకొచ్చినా ఆతని గంభీరవదనాన్ని చూసి పలుకరించడానికి ధైర్యం చాలక కిమ్మనకుండా వెనుదిరిగి వచ్చేసేవాడు.


ఎదురు చూస్తున్న శుభఘడియ రానే వచ్చింది. రేపే అరుణ్ పెళ్ళి.

ఆరోజు ముత్తయిదువులందరూ కలసి అరుణ్‌ను పెళ్ళికొడుకుని చేశారు. అరుణ్ ముందు తల్లిఫోటోకి మొక్కి ఆ తర్వాత తండ్రికి దణ్ణం పెట్టాడు.

ఆనందబాష్పాలు రాలుతుండగా అరుణ్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు మూర్తిగారు.

ఆ చనువుతో అరుణ్‌కు కొండంత ధైర్యం వచ్చేసింది.

"నాన్నగారూ! మీరు రోజురోజుకీ ఏదో మనోవ్యాధితో కృంగికృశించి పోవడానికి కారణం? ఇన్ని రోజులూ బాగానేవున్న మీరు నా పెళ్ళి ఖాయమైన



నాటినుండీ ఎందుకిలా అయిపోతున్నారు? నాన్నగారూ నాకు తల్లీ తండ్రీ గురువూ దైవం అన్నీ మీరే! మీరులేకుంటే నేను బ్రతకలేను. మనసులోవున్న వేదనను ఎదుటివ్యక్తికి చెప్పుకుంటే కాస్త ఉపశమనంగా వుంటుంద దంటారు చెప్పండి... మీరెందుకిలా మథనపడ్తున్నారో చెప్పండి మీ బాధలో నన్నూ పాలుపంచు కోనివ్వండి నాన్నగారు! మీరు పడ్తున్న ఆ మనఃక్షోభను నాకు చెప్పేంతవరకూ...''

''చెప్తాను అరుణ్! తప్పకుండా చెప్తాను. ఇన్నేళ్ళుగా నేను భరిస్తున్న ఈ హృదయఘోషను ఎక్కడ్నుంచి మొదలెట్టాలో ఎలా అంతం చేయాలో అర్థంగాక ఇన్నాళ్ళూ నేను సతమత మౌతున్నాను బాబూ!

ఐతే! ముందుగా నీకో విషయం చెప్పదలిచాను. శ్రద్ధగా ఆలకించు నాయనా! ఇప్పుడు నేను చెప్పే ప్రతి మాటలోనూ జీవం నిండి వుందన్న సత్యాన్ని మరచిపోకు!

''తండ్రి మాట జవదాటని తనయుడ్ని చూసి ఆ తల్లిదండ్రులే గాదు ఊరు వూరంతా అతగాడిని గొప్పగా కొనియాడుతుంటారు. వారి సంతతికూడా అతని లాగే మంచి మర్యాద నేర్చుకొమ్మని బోధ చేస్తూ వుంటారు.

అలనాడు శ్రీరామచంద్రుడు పితృవాక్యాన్ని శిరసావహించి భార్యతో కారడవులకు వెళ్ళిపోయాడు. ఆ తండ్రి కొడుకు దూరమైనందులకు ఒకవైపు చింతించినా తన మాటకు విలువనిచ్చి తన పేరును నిలిపినందుకు ఎంతగానో సంతోషించి పుకిటాడుకదా!

అలాగే ! సత్యహరిశ్చంద్రుడు అతడు ఆడినమాట తప్పని వాడై కట్టుబట్టల్తో భార్యాబిడ్డతో రాజ్యాన్ని వదిలి వెళ్ళిపోయాడు.

కష్టాలెన్ని ఎదురైనమా సత్యం వీడనివాడై ఆఖరికి తన భార్యనే నడివీధుల్లో బెట్టి బానిసగా వేలంవేయించా డు.

అతడంతటి సత్యవంతుడుకాబట్టే ఆతని కీర్తి తరతరాలుగా చిరస్థాయిగా నిలిచిపోయింది.

ఇకపోతే! ధర్మరాజు జూదంలో భార్యను పణంగాపెట్టి ఓడిపోయిన ధర్మదాత! నిండుసభలో తన భార్యను తన కళ్ళెదురుగానే చీర లాగేస్తూంటే మహామహులైనటువంటి ఆ ఐదుగురు భర్తలూ ధర్మబద్ధులై తలలు వంచుకున్నారే తప్ప ఏమీ చేయలేకపోయారు.

ఆ సమయానికి కృష్ణుడు కనికరించి చీరలివ్వక పోయుంటే ఆ ద్రౌపతి మానం ఏమయ్యుండేది?

ద్రౌపతి వస్త్రాపహరణం గురించి జనులంతా ఇప్పటికీ గొప్పగా చెప్పుకుంటున్నారు కదా!

పితృవాక్య పరిపాలనా దక్షుడైన శ్రీరామచంద్రుడూ, సత్యం కోసం సతినే అమ్మిన హరిశ్చంద్రుడూ, ధర్మం కోసం భార్యనే అవమాన పాలుగావించిన ధర్మారాజు.... ఇలా చెప్పుకుంటూ పోతే ఆడినమాట తప్పనివాళ్ళు ఈ భూమ్మీద ఎందరో వున్నారు.

వీరందరి రక్తమూ ప్రతి భారతీయునిలోనూ నరనరానా ప్రవహిస్తున్నది,

అందువల్లనే! నేనూ నా తండ్రిమాటకు ఎదురు చెప్పక అందరిచే శ్రీరామచంద్రుడనే ప్రశంసలు ఎన్నెన్నో పొందాను.

అలాగే నువ్వూ తండ్రిని మించిన తనయుడివ య్యావు...''

ఇవన్నీ నాన్నగారు తనతో ఎందుకు చెప్తున్నారో అర్థంగాక అయోమయంగా చూస్తూ మౌనంగా వినసాగాడు అరుణ్.

''ఇప్పుడు నేనడుగుతున్న ఒకేఒక్క కడసారి కోరికను కాదనవని నాకుతెలుసు.

''ఎందుకంటే నువ్వూ ఆ రాముడివే కాబట్టి ఆడిన మాట తప్పడం మన వంశంలోనే లేదుకాబట్టి.

దశరథుడు రాముడ్ని పదునాలుగేళ్ళు వనవాసానికెళ్ళమని చెప్పకుండా రామా! నువ్వు పట్టాభిషిక్తుడివయ్యేలోగా అపరంజి బొమ్మలాంటి నీ భార్యతో నేనొక్కరాత్రి గడపాలనుంది అని అంటే ఆ రాముడు కాదంటాడా!

అలాగే ఇప్పుడు నేనూ...

అరుణ్ తలలో డైనమెట్స్ భయంకరమైన శబ్దాలుచేస్తూ ప్రేలుతున్నాయి. గిరున కళ్ళు తిరిగిపోతున్నాయి. తనశరీరం అలాగే భూమిలోనికి కూరుకు పోతున్నట్లుగా వుంది. ఎదురుగా మంచంపై కూర్చుని పెదవులు కదిలిస్తున్న తన తండ్రి ఏం చెప్తున్నారో వినబడటం లేదు. తన చెవుల్లో సీసం పోసినట్లు పూర్తిగా మూసుకుపోయాయి.



సస్పెన్స్

పేషెంట్‌ను పరీక్షించడం పూర్తయ్యాక వెళ్ళిపోతూ ''మిమ్మల్ని మళ్ళీ రేపు ఉదయం చూస్తాను'' అన్నాడు డాక్టర్.

''కానీ నేను మిమ్మల్ని రేపు చూడగలనా డాక్టర్!'' ఆదుర్దాగా అడిగాడు పేషెంట్.

—జోకర్ (హైద్రాబాద్)

'ఓ భగవంతుడా! నువ్వు రామావతారాన్ని ఎందుకు ఎత్తావయ్యా! ఈ తండ్రులు నీ కథల్నిచెప్పి మాలాంటి కొడుకులకు నోరు లేకుండాచేసి మమ్మల్ని నట్టేట్లో ముంచడానికా!

రామా! ఏ తండ్రయినా ఇలాంటి కోరికను కోరుతాడా! ఇప్పుడు నాకేమనిపిస్తుందో తెలుసా! గొడ్డలి చేతబట్టుకుని పరశురాముడిలా విజృంభించి నా తండ్రి తలను వెయ్యి ముక్కలు చెయ్యాలని వుంది. మన భారతమాతను అపవిత్రంగావించే ఇలాంటి నీచబుద్ధులున్న భ్రష్టులు ఈ భూమ్మీద వుండకూడదు. ఈ నీచపురుగుల్ని సర్వనాశనం చేసేయాలి.

ఒక్కసారి ఉప్పెనలాలేచిన కసిని అతిబలవంతంగా అణచుకోడానికి విశ్వప్రయత్నంచేస్తూ తలెత్తి తండ్రివైపు మాడ్డానికి మనస్కరించక అలాగే తలదించుకుని తన గదిలోనికి వెళ్ళిపోయాడు.


రేపే పెళ్ళి... పెళ్ళి చేసుకుని తండ్రి కోరిన తుది కోరికను తీర్చి ఆయనకు ఆత్మశాంతిని కల్గించడమా! లేక పెళ్ళే మానుకుని బ్రహ్మచారిగా మిగిలిపోవడమా!


ఈ చిక్కు సమస్యకు పరిష్కారం ఆలోచించేటప్పటికి అర్ధరాత్రి దాటింది. ఇలాంటి నంధలవు తండ్రి బ్రతికుండి మరింత పాపం మూటగట్టుకునేందుకన్నా కన్న కొడుకుచేతిలో హాయిగా చనిపోవడమే మంచిదనే నిర్ధారణ కొచ్చేశాడు అరుణ్.

* * *

మూర్తిగారు మెడలవరకూ కప్పుకున్న ఆ రగ్గును అతి జాగ్రత్తగా ప్రక్కకు తొలగించాడు.

తండ్రి గుండెల్లోకి గురిచూసి బలంగా కత్తిని





నిరాశ

ఓ మొండి జబ్బుతో బాధపడ్తూ ఎంతోమంది డాక్టర్ల చుట్టూ తిరుగుతున్న జబ్బుగ్రాలావ్ ఇంకో డాక్టర్ దగ్గరకు వెళ్ళి—

"ఇంతవరకు ఈ జబ్బు మీద నేను దాచుకున్న దాంట్లో మూడొంతులకు పైగా ఖర్చుపెట్టాను డాక్టర్" అన్నాడు.

"అరే ముందే నా దగ్గరకు వచ్చి వుండాల్సింది!" అన్నాడు నిరాశగా డాక్టర్.

—జోకర్ (హైద్రాబాద్)

దించాలని విసురుగా కత్తిని పై కెత్తాడు.

ఆ క్షణంలోనే అకస్మాత్తుగా అరుణ్ చూపులు మూర్తిగారి వైపుకి మళ్ళాయి. ఆఖరుసారిగా ప్రశాంతంగా నిద్రబోతున్న తండ్రి ముఖాన్ని చూస్తూంటే!

తనకు పసితనంలో లాలపోసి తల్లిలా జోలపాడి నిద్రపుచ్చే నాన్న ఆడుకుంటున్నప్పుడు తనకాల్లో కాస్తముల్లుదిగితే వారి గుండెల్లో బాకు దిగినట్లుగా విలవిలలాడి పోయే నాన్న..." ఇలా తల్లిలేని తనసెంత శ్రమపడి పెంచాడో సినిమారీలులా కళ్ళముందు కదలాడసాగింది.

ఎంతో కష్టపడి తన వింతవాడ్ని చేసిన కన్నతండ్రిపై కత్తి దూయడం తలచుకుని సిగ్గుతో కుచించుకుపోతూ వెక్కిళ్ళగా రోదించసాగాడు. ఆ కత్తిని పట్టుకునేందుక్కూడా శక్తిలేనివాడై నిలువెల్లా వణికిపోతూ దాన్నక్కడే పడేసి తన గదిలోకొచ్చి బావురుమని ఏడవ సాగాడు.

'రామా! నేనూ రాముడ్నేనయ్యా! పరశురాముడ్ని మాత్రం కాలేను. ఎందుకో తెలుసా! నీలాగే పాపభీతి అనేది మా రక్తంలో కలిసిపోయినందువల్ల నా తండ్రిని చంపలేకపోతున్నాను.

అయినా నిన్ననీ లాభం లేదు రామా! అందరూ నీలా మారుతారనీ వారి తండ్రులు నీ తండ్రిలాంటి వారుకారనీ కనీసం ఊహించుంటే అవతారాన్ని ఎత్తుండేవాడివా!' నువ్వూహించివుంటే అలా రామావతారాన్ని ఎత్తుండేవాడివా!'

మనఃక్షోభతో తల్లడిల్లిపోతున్న అరుణ్ తెల్లారింది కూడా గమనించలేదు.

మనసుశూన్యమైనా మెదడు స్తంభించిపోయినా కాలమనే చక్రం మాత్రం బాధ్యతగా తన పనులను నిర్వర్తించుకుంటూ వేగంగా తిరిగిపోతూనే వుంటుంది.

ముహూర్త సమయం ఆసన్నమైంది. అరుణ్‌ను పెళ్ళి కొడుకునుచేసి "నాన్నగారికి నమస్కరించి పీటలపై కూర్చోనాయనా!" అన్నారు పెళ్ళి పెద్దల్లో ఒకరు.

ఆ మాటను వినిపించుకోనట్లు నేరుగావెళ్ళి తల్లిఫోటోకు దణ్ణంపెట్టి పందిట్లోకి నడిచాడు.

అరుణ్ గంభీరవదనాన్నిచూసి అందరూ కిమ్మనకుండా వూరుకున్నారు.

మూర్తిగారు తన మంచం ప్రక్కనేవున్న పెద్ద కిటికీని తెరిపించి దిండ్లకు ఆనుకుని కూర్చుని పెళ్ళిని తిలకించసాగారు.

అరుణ్ యాంత్రికంగా శిల్పమెడలో మూడుముళ్ళూ వేశాడు. పెళ్ళితంతు ముగిసింది.

శిల్పా అరుణ్‌లను ఇంటి ముఖద్వారం వద్ద నిలబెట్టి ఎర్రనీళ్ళ దిష్టితీసి పోశారు ముత్తయిదువులు.

"శిల్పా! కుడికాలుతో ఇంట్లోకి ప్రవేశించి ముందుగా మేడమీదున్న మామగారి ఆశీర్వాదం తీసుకుని రామ్మా!" అంది శిల్ప తల్లి.

అలాగేనంటూ కుడికాలును గడపలోపలకి వేసింది.

అంతవరకూ మంత్రముగ్ధుడిలా మూగనోము పట్టినట్లున్న అరుణ్ వెంటనే "అక్కర్లేదు.." అంటూ ఇంటిపై కప్పు ఎగిరిపడేటట్లు గట్టిగా అరిచాడు.

ఆ కేకతో శిల్పతోపాటూ అక్కడున్న పెళ్ళి జనమంతా అదిరిపడిపోయి స్థాణువల్లే వుండిపోయారు.

"శిల్పా! లోనికెళ్ళకు నాతోరా! వెళ్ళిపోదాం" అంటూ గర్జించాడు అరుణ్.

"బాబూ! వేసిన అడుగును వెనక్కు తీస్తే అపశకునం నాయనా!" అన్నారు శిల్ప తండ్రి.

"ఈ ఇంటితో తెగతెంపులు చేసుకుని నేను శాశ్వతంగా వెళ్ళిపోతున్నాను. అరుణ్ వాళ్ళమ్మగారితో పాటే చిన్నవాడే చచ్చాడని అనుకోమనండి ఆ మూర్తిగారిని" అంటూ గేటుదాటి వెళ్ళిపోసాగాడు అరుణ్.

అరుణ్ ఉగ్రరూపాన్ని చూసి మారుమాట్లాడకుండా అతన్ననుసరించ సాగింది శిల్ప.

శిల్పా అరుణ్‌లు అలా వెళుతూంటే సీతారాములు అడవికి వెడలిపోతున్నట్లు అనుభూతి చెంది అందరూ కొయ్యబారి చూస్తూండిపోయారు.

అరుణ్ రైల్వేస్టేషన్ కెళ్ళి హైద్రాబాద్‌కు టిక్కెట్లు తీసుకుని అలసటగా అక్కడున్న బెంచ్‌పై కూర్చున్నాడు.

రాత్రంతా నిద్రలేని కారణంగా అతని కళ్ళు ఎర్రగా నెత్తురు చిమ్ముతున్నట్లున్నాయి.

అంతవరకూ పెదవి విప్పని శిల్ప మెల్లగా ధైర్యాన్ని కూడదీసుకుని

"ఏమండీ! మీరు నన్నెందుకింట్లో కెళ్ళొద్దన్నారో నాకర్థం గావటం..."

"నువ్వా ఇంట్లో కాలుపెడితే నాకు తల్లివౌతావు కాబట్టి పరమ నికృష్టుడైన నా తండ్రి..."

"బాబుగారూ! మీరిక్కడున్నారా ఈ వుత్తరాన్ని మీకివ్వమని చెప్పి నాన్నగారు పనిపోయారు..."

అరుణ్ ఆశ్చర్యంగా ఆ కవర్ని అందుకుని ఆత్రుతగా చదవసాగాడు.

"బాబూ అరుణ్! దయచేసి నేను రాసిన ఈ ఉత్తరాన్ని సాంతం చదువుతావు కదూ!

ఇప్పుడు నిన్నూ నీ సాహసాన్నీ చూసి నేను చాలా గర్వపడుతున్నాను బాబూ! ఎందుకో తెలుసా! నువ్వు శ్రీరామచంద్రుడివి కాలేదుకాబట్టి. అంటే నాలాంటి పిరికిముండా కొడుకివి కానందుకు నాకు చాలా సంతోషంగా వుంది నాయనా!

చిన్నప్పట్నుండీ నిన్నీ చేతుల్తో పెంచినందువల్ల నువ్వూ నాలాగా తయారవుతావేమోనని భయపడ్డాను.


తీరా చూస్తే నేను భయపడిందంతా నిజమే అయ్యింది. ఆ రోజు నువ్వేమన్నావో గర్తుందా! 'నాన్నా! నేను శిల్పను పెళ్ళాడ్డం మీకిష్టం లేకపోతే! మీ ఇష్టప్రకారమే మీకు నచ్చిన అమ్మాయినే చేసుకుంటానన్నావ్.

ఆ మాటే నన్ను తీరని వ్యధకు గురిచేసింది. మాటికి మారుపలుకూ నాబుద్ధులే వచ్చాయని నేనెంతగా క్షోభించానో చెప్పలేను.

నువ్వూ ఆ రాముడిలా అయ్యావని తెలిసి కుమిలి కుమిలి ఏడ్చాను.'

పెళ్ళంటే నెయ్యేళ్ళపంట బాబూ! పెద్దల ఇష్టానుసారంతో మనసులు కలవని మనువులు చేసుకుని సంసారంతో రాజీపడలేక జీవితమంతా దుఃఖమయం చేసుకోవడం నేను సహించలేను.

అదే నువ్వు ఒక్కసారి "నాన్నా! నువ్వు కాదు గదా! ఆ బ్రహ్మదేవుడడ్డొచ్చినా కూడా నేను శిల్పమెడలో తాలికట్టి తీరుతాను అని చెప్పివుంటే ఏమండె. ధైర్యానికి



జోహార్లర్పించుమండే వాడ్ని.

అరుణ్! ఈ ఉపోద్ఘాతం చదువుతూంటే నీకు విసుగన్పిస్తూంది కదూ!

చెప్తాను బాబూ అసలు కథ చెప్తాను. ఇన్నాళ్ళూ నా గుండెల్ని మెలిపెడ్తున్న మీ తల్లి మరణరహస్యాన్ని నేను చనిపోయేలోగా నీకు చెప్పదలిచాను.

కానీ చిన్నవాడైన నీకు ఈ విషయాన్నెలా చెప్పాలో అర్థంగాక సతమత మౌతూ ఆఖరికి 'దీన్ని' నీకు ప్రాక్టికల్‌గా తెలియజేద్దామని నిర్ణయించుకుని ఆ రోజు నీతో నేనలా మాట్లాడాను.

అరుణ్ ఇంకా నీకర్థం కాలేదు కదూ!

ఆనాడు... నేను కూడా నీలాగే ప్రవర్తించి వుంటే మీ అమ్మను పోగొట్టుకుని నా బ్రతుకంతా క్రుంగి కృశిస్తూ వుండేవాణ్ణి కాదేమో!

దీనికంతా మూలకారణం ఎవరు? ఆ రాముడే!

నాకున్న ఆ పేరును పోగొట్టుకోలేక తండ్రికి ఎదురు చెప్పలేని అశక్తుడనయ్యాను.

అందుకే నాకు ఆ రాముడంటే అంతకష్టా రామావతారం మీదనే చెప్పలేనంత ఈర్ష్య పేరుకు పోయాయి.

నేను నా తల్లిదండ్రులకు నచ్చిన అమ్మాయి వేదవతిని పెళ్ళి చేసుకున్నాను. నా వేదవతి చాలా అందమైంది అంతకంటే తెలివైంది కూడాను.

మా దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగిపోసాగింది. మా అమ్మజబ్బుతో మంచం పట్టి చనిపోయింది. ఏడాది తిరక్కుండానే నువ్వుపుట్టావు.

అమ్మను మరచిపోలేక మానాన్నగారు త్రాగుడుకు బానిసైపోయారు. ఇరవై నాలుగ్గంటలూ తాగి తాగి ఆయన ఆరోగ్యాన్ని పూర్తిగా క్షీణింపజేసుకున్నారు.

ఎంతతాగినా నాన్నగారు చాలా కంట్రోల్‌లో వుంటారు. ప్రతిమాటా తూచి తూచి మాట్లాడేవారు. అందుకే వారి మాటంటే నేను వేదవాక్కుగా భావించేవాణ్ణి.

నాన్నగారికీ నేనంటే ఎంతో ప్రేమ. ఒక్కరోజు కూడా నన్ను చూడందే పచ్చిమంచినీళ్ళు కూడా ముట్టేవారు కాదు.

అప్పటికీ నీవు ఆర్నెల్ల పిల్లాడివి.

ఒకరోజు నాన్నగారు నన్ను పిలిపించి దగ్గర కూర్చోబెట్టుకున్నారు. ఆయన ప్రాణం రోజుల్లో వుంది.వారి , బాగోగులన్నీ వేదవతి దగ్గరుండి చూసుకుంటుండేది.

'ఆ... రో... జు' నీతో నేను ఏం మాట్లాడానో ఎలాంటి కోరికను కోరానో అవన్నీ 'తు.చ' తప్పకుండా ఆనాడు మానాన్నగారు నాతో చెప్పినవే!

''ఒరేయ్ మూర్తీ! వేదవతిని చూస్తూంటే మీ తల్లిని చూస్తూన్నట్లుందిరా! అందుకని ఆఖరి కోరికగా ఈ ఒక్కరాత్రి వేదవతిని నా దగ్గరకు పంపు'' అన్నారు.

ఇంతకాలం నాన్నగారి మాటకు ఎదురాడని నేను ఏం చేయాలో తోచక చాలాసేపు మానసిక సంఘర్షణలో పడి-నలిగిపోయాను. అదే నాలో వున్న పిరికి తనం.

ఇన్నాళ్ళూ పితృవాక్య పరిపాలకుడిగా వూరంతా మంచిపేరు తెచ్చుకున్న నేను... ఈ అవసానదశలో నాన్న కోరిన తుదికోరికను కాలదన్నడమా! ఇలాగే ఆలోచిస్తున్న నన్ను ''ప్రొద్దుపోయింది భోజనంచేస్తూ రండి'' అంటూ వేదవతి నా దగ్గరకు వచ్చిపిలిచింది.

నేను మౌనంగావుండటం చూసి ఏదో కష్టం ముంచుకొచ్చిందేమో ననుకుంది.

''మీరింత బేలగా బాధపడకండీ కష్టాలు కలకాలం వుంటాయా! ముందు అన్నం తిన్నాక ఆ తర్వాత విషయమేమిటో చర్చించుకుందాం! రండి'' అంటూ ఆప్యాయంగా చేయి పట్టుకుని తీసుకెళ్ళి అన్నం పళ్ళెం ముందుపెట్టింది. ఒక్కముద్ద కూడా నోటపెట్టలేక రెండు చేతుల్తో ముఖాన్ని కప్పుకుని ఏడుస్తూ నాన్నగారు కోరిన ఆ కోరికను చెప్పేశాను.

''వేదవతీ! నేనుపుట్టి బుద్ధెరిగి నప్పట్నుండీ నాన్నగార్ని దేవుడిలా పూజిస్తూ వారి మాటలను గౌరవిస్తూ వచ్చాను.

ఇప్పుడు ఈ కోరికను కాదంటే ఇహ నేను నాన్నగారికి ముఖం చూపించగలనా!

పుత్రుడు అంటే పున్నామ నరకం నుండి తల్లిదండ్రుల్ని రక్షించువాడు అని అంటారు.

అలాంటిది ఈ ఆఖరు క్షణంలో ఆయనకు ఆత్మశాంతి నివ్వకుండా ఆత్మక్షోభను కల్గించమంటావా!

రేపాయన చనిపోయాక తండ్రి కోరికను తీర్చలేకపోయానే! అన్న మానసిక చిత్రవధను నన్నుభవించమంటావా!...'' నాపాటికి నేనిలా చెప్పుకు పోతూనే వున్నాను.

నా మాటలువింటూ కళ్ళు కూడా ఆర్పడం మరచిపోయి నా అంతర్యాన్ని బాగా ఆకళింపు చేసుకోసాగింది.

''ఉండండి... ఇప్పుడే వస్తాను'' అంటూ పెరట్లోకెళ్ళి బావిలో దూకేసింది.

'ధబ్' మన్న శబ్దం విని పరుగున బావిలోకి తొంగిచూశాను. వేదవతి మునకలు వేస్తూవుంది.

ఈ విషయం చెప్పడానికి ముందుగా నాన్నగారి దగ్గరికెళ్ళాను. ఆయన ప్రాణం ఎప్పుడో అనంత వాయువుల్లో కలిసిపోయి వుంది.

అంటే నాతో నాన్నగారు మాట్లాడిన వెంటనే చనిపోయి వుంటారు.

అప్పుడు తెలిసింది నాకు 'చావు తెలివి' అంటే ఇదేనని.

త్వరగా మీ అమ్మను రక్షించుకోడానికి ఇరుగుపొరుగుల్ని పిలుచుకు వచ్చేసరికే వేదవతి శవం బావిలో తేలుతూ కన్పించింది.

ఆ క్షణం నుంచీ నా పిరికితనానికి చింతించని రోజంటూలేదు. నా కొడుక్కూడా నాలా చాతకాని వన్నెట కాకూడదనీ తన స్వంత తెలివి తేటలతో జీవితాన్ని చక్కదిద్దుకోవాలనీ అందుకు పెద్దలు ఎన్ని ఆంక్షలు పెట్టినా వెనుకంజ వేయకూడదనీ ఆత్మస్థైర్యం కలవాడై వుండాలనీ దీక్ష పట్టాను.

'రఘురామ్' అన్న నీ పేరును ఆ క్షణమే అరుణ్‌గా మార్చివేసి క్రమశిక్షణతో పెంచి పెద్దజేశాను.

కానీ మొన్నటి నీ వాక్కులతో నా కలలన్నీ కల్లలైపోయాయని భయపడ్డాను. నువ్వు శ్రీరామచంద్రుడూ ధర్మరాజూ, హరిశ్చంద్రుళ్ళలా మారకూడదూ. నీ జీవితాన్ని దుఃఖమయం చేసుకోకూడదు. అదే నా ఆశ, ఆకాంక్ష.

అందుకే నీ మనసును పరీక్షించాను. ఆ రాత్రి... నువ్వు నన్ను చంపడానికి వచ్చినప్పుడే నాకు నీపై మంచి విశ్వాసం కుదిరింది.

ఫరవాలేదు నా బిడ్డ రాముడుకాడని గర్వపడ్డాను.

నువ్వు కన్నతండ్రినీ ఆస్తిపాస్తుల్నీ కాలదన్ని వెళ్ళిపోతున్నప్పుడు శభాష్ అరుణ్ పెంచిన ప్రేమను సఫలం చేశావు విష్ యూ బెస్టాఫ్‌లక్ అని మెచ్చుకున్నాను.

అరుణ్ ఇప్పటికి అర్థమైందా! ఆరోజు నిన్ను నేను అడిగిన మాటలన్నీ నావి కావనీ ఆనాడు మానాన్నగారు నన్నడిగినవేనని తెలుసుకున్నావ్‌గా!

ఇంతకాలం నిన్నో ఇంటివాడ్ని చేయాలని ప్రాణాల్ని ఉగ్గబట్టుకుని వేచివున్న నాకు ఆ బాధ్యత కూడా తీరిపోయింది.

ఇక నిశ్చింతగా మీ అమ్మదగ్గరకు వెళ్ళిపోతున్నాను. వెళ్ళి చూశావా వేదవతీ! మనబిడ్డను నాలా పిరికి పంద కాకుండా నీలాగా పౌరుషవంతుడిగా ఎలా తయారుచేశానో చూశావా!'అని చెప్పాలి.

ఇన్నాళ్ళుగా నేననుభవిస్తున్న ఈ 'హృదయఘోష'ను ఇప్పటికి నీకు తెలియజేసి నేవెళ్ళిపోతున్నాను బాబూ!

మీరు త్వరగా ఇంటికి వచ్చి నన్ను కాటికి సాగనంపుతారు కదూ!''

ఇట్లు
అహర్నిశలూ నీ శ్రేయస్సు కాంక్షించే
నీ తండ్రి
శ్రీరామచంద్రమూర్తి

అరుణ్ కళ్ళలోంచి కన్నీళ్ళు జలజలమని ఏకధారగా వర్షిస్తూంటే ''నాన్నా!!!'' అంటూ ఇంటివైపు పరుగెట్టసాగాడు.

అర్థంగాని శిల్ప అరుణ్‌ని అనుసరించసాగింది. *

